క్లుప్తంగా

ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



బాలింతలకు బ్రెడ్డు పంపిణీ చేస్తున్న ఇన్నర్‌వీల్ సభ్యులు

తాడిపత్రి అర్బన్: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో బాలింతలకు బ్రెడ్డు, పాలు పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు కౌసర్ బేగం మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమన్నారు. ఈకార్యక్రమంలో ఇన్నర్‌వీల్ క్లబ్ కార్యదర్శి వంకదారి రేణుక, సభ్యులు సవీరా, లలిత, నర్సులు, పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యం కోసం శ్రమించాలి



విద్యార్థికి ప్రతిభా పురస్కారాన్ని అందిస్తున్న బలిజ సంఘం నాయకులు

గుత్తి రూరల్: ప్రతి విద్యార్థీ లక్ష్యం సాధించేందుకు శ్రమించాలని బలిజ సంఘం దక్షిణ భారతదేశం కాపు, బలిజ, తెలగ, ఒంటరి సంఘం కన్వీనర్ దాసరి రాము, గుత్తి బలిజ సంఘం అధ్యక్షుడు మారాకుల రమణ, బలిజ సంఘం నాయకుడు ఆముదాల గిరిధర్, టీడీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణ సూచించారు. పట్టణ శివార్లలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం కృష్ణదేవరాయ బలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పురస్కారాలను అందించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి, శ్రీకృష్ణదేవరాయ చిత్రపటానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలికలసాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కృష్ణదేవరాయ సంక్షేమ సంఘం నాయకులు శ్రీకరం వెంకటేష్, శ్రీకరం గోవిందరాజులు, నాగరంగ ప్రసాద్, బాలరాజు, పూలరమణ, రవి, విజయ్ పాల్గొన్నారు.

వ్యక్తి మృతి



లక్కిరెడ్డి మృతదేహం

గుత్తి రూరల్: మండలంలోని బాచుపల్లి గ్రామ శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడి తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ లక్కిరెడ్డి(38) అనే వ్యక్తి ఆదివారం మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. కరిడికొండ గ్రామానికి చెందిన లక్కిరెడ్డి పని నిమిత్తం గుత్తికి వచ్చి తిరిగి గ్రామానికి వెళ్తూ గత జూలై 28న బాచుపల్లి గ్రామ శివారులో బాట సుంకులమ్మ ఆలయం ఎదురుగా ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబసభ్యులు అతడిని అనంతపురం ఆస్పత్రికి తరలించగా .. చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉచిత ఇసుక హామీ ఏమైంది?




మాట్లాడుతున్న సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్ర స్వామి

గుత్తి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు రెండు నెలలు కావస్తుంది. ఉచిత ఇసుక హామీ ఎప్పుడు అమలు చేస్తారని సీపీఐ నాయకులు ప్రశ్నించారు. గుత్తి పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. సీపీఐ మండల కార్యదర్శి రామదాసు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నియోజకవర్గం కార్యదర్శి వీరభద్రస్వామి మాట్లాడారు. ఉచిత ఇసుకను ఇస్తున్నట్లు కూటమి ప్రభుత్వం ప్రకటనలు గుప్పిస్తున్నారన్నారు. అయితే ఆచరణలో ఉచితంగా ఇసుకను ఇవ్వడం లేదన్నారు. ముఖ్యంగా గుంతకల్లు నియోజకవర్గంలో ఎక్కడా ఉచితంగా ఇసుకను ఇచ్చిన పాపానపోలేదన్నారు. ఎప్పుడు ఉచితంగా ఇసుకను ఇస్తారో సమాధానం చెప్పాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గం సహాయ కార్యదర్శి రమేష్, పట్టణ కార్యదర్శి రాజు, పట్టణ, మండల సహాయ కార్యదర్శులు నరసింహ ఆచారి, నజీర్, సీనియర్ నాయకులు వెంకటరాముడు, షఫీ, రామకృష్ణ, డేనియల్, బాబు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని అనంతపురం–తాడిపత్రి రహదారిపై ఆదివారం సాయంత్రం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వాహనదారులు నిబంధనలు పాటించాలన్నారు. అనంతరం పలువురికి జరిమానా విధించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్‌తో ప్రభుత్వం చెలగాటం



కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్యావ్యవస్థ గాడితప్పింది. ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభమై రెండు నెలలైనా విద్యా కానుక కిట్లు అందజేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. పలు పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత వేధిస్తుండడంతో విద్యార్థులు చదువు ముందుకు సాగడంలేదు. అలాగే మధ్యాహ్న భోజనం ఏజెన్సీలను మార్చడంతో కొత్తగా వచ్చిన ఏజెన్సీ నిర్వాహకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఉడకని అన్నం... నీళ్ల చారు వడ్డిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు.

- అందని విద్యా కానుక కిట్లు
- వేధిస్తున్న టీచర్ల కొరత
- అధ్వానంగా మధ్యాహ్న భోజనం

తాడిపత్రి/గుంతకల్లు/శింగనమల: గతంలో బడి తెరచిన రోజే విద్యార్థులకు అవసరమైన విద్యా కానుక కిట్లు విద్యార్థులకు అందేవి. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోంది. 2024 –25 విద్యా సంవత్సరం మొదలై దాదాపు రెండు నెలలు కావస్తోంది. తాడిపత్రి, శింగనమల, గుంతకల్లు నియోజకవర్గాల్లో చాలా పాఠశాలల్లో విద్యాకానుక కిట్లను పంపిణీ చేయలేదు. అలాగే విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులు లేరు. ప్రధాన సబ్జెక్టులను బోధించే ఉపాధ్యాయుల కొరత వేధిస్తుండడంతో విద్యార్థులు చదువు ముందుకు సాగడం లేదు. టీచర్ల కొరత పరిష్కరించి, విద్యార్థులకు విద్యాకానుక కిట్లను పంపిణీ చేయాలని తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు.

విద్యాకానుక పథకానికి గ్రహణం

ప్రభుత్వ అలసత్వం, విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ లోపం వెరసి విద్యాకానుక పథకానికి గ్రహణం పట్టుకుంది. స్కూళ్లు తెరిచి రెండు నెలలు కావస్తున్న నేటికి విద్యార్థులకు యూనిఫారం ఇవ్వలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో విద్యాసంవత్సరం ప్రారంభం నాటికే జగనన్న విద్యాకానుక కిట్లు సిద్ధం చేసి వందశాతం అందించే వారు. కానీ కూటమి ప్రభుత్వం విద్యావ్యవస్థను నిర్లక్ష్యం చేస్తోందని విద్యార్థి సంఘాల నాయకులు మండిపడుతున్నారు. అలాగే గుంతకల్లు, శింగనమల, తాడిపత్రి నియోజకవర్గాల్లోని పలు పాఠశాలలో మధ్యాహ్నం భోజనంలో నాణ్యత కొరవడంతో అన్నం ముద్దముద్దగా ఉంటోందని విద్యార్థులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం మధ్యాహ్న భోజన ఏజెన్సీలు మారడంతోనే ఈ పరిస్థితి నెలకొందని తెలుస్తోంది.



పెద్దవడుగూరు మండలంలోని గుత్తి అనంతపురం పాఠశాలలో ఐదు తరగతులను ఒకే గదిలో నిర్వహిస్తున్న దృశ్యం



పామిడి మండలం గజరాంపల్లిలో ఒకే పాఠశాల గదిలో 1వ తరగతి నుంచి 5వ తరగతి విద్యార్థులు

ఉపాధ్యాయుల కొరత

తాడిపత్రి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హిందీ, సోషియల్ సబ్జెక్టుల ఉపాధ్యాయులు లేరు. యాడికి ఆదర్శ పాఠశాలలో 6,7,8 తరగతులకు సైన్స్, సోషియల్ ఉపాధ్యాయులు లేక విద్యార్థుల చదువు ముందుకు సాగడం లేదు. ఆలాగే గుంతకల్లు మున్సిపాలిటీ పరిధిలోని డాక్టర్ రాజేంద్రప్రసాద్ హైస్కూల్, పొట్టి శ్రీరాములు మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. అలాగే మిగిలిన హైస్కూళ్లల్లో కూడా సబ్జెక్టు టీచర్ల కొరత వేధిస్తోంది. గత ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేందుకు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసినా కూటమి నాయకులు కోర్టులకు వెళ్లి పోస్టులను భర్తీ చేయకుండా అడ్డుకున్నారు. దీనికితోడు ప్రభుత్వం సర్దుబాటు ప్రక్రియలో భాగంగా ఉపాధ్యాయులను బదిలీ చేసింది. అయినా కూటమి నాయకులు ఉపాధ్యాయులు విధుల్లో చేరకుండా అడ్డుకున్నారు. ఫలితంగా ఉపాధ్యాయుల కొరతతో బోధనకు ఆటంకంగా మారింది.

తరగతి గదులు లేక..

పెద్దవడుగూరు మండలంలోని దిమ్మగుడి ప్రైమరీ పాఠశాలలోనూ, గుత్తి అనంతపురం, రాంపురం, కాశేపల్లి, వీరేపల్లి, కొండుపల్లి, గంజిగుంటపల్లి, మొళకతాళ్ల గ్రామాల్లోని పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు తరగతి గదుల కొరత వేధిస్తోంది. ఒకటే తరగతి గది ఉండటంతో వరండాలో విద్యార్థులకు ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తున్నారు. అలాగే పామిడి మండలం గజరాంపల్లిలో, దిబ్బసానిపల్లి గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలను ఆర్‌డీటీ బిల్డింగ్‌ల్లో ఒకే భవనంలో 1 తరగతి నుంచి 5వ తరగతి వరకూ విద్యార్థులకు చదువు చెబుతున్నారు. శింగనమల మండలంలో పోతురాజుకాల్వ, రాచేపల్లి, నాగులగుడ్డం తండా పాఠశాలలో ఉపాధ్యాయులు పదవీ విరమణ చేయడంతో ఖాళీగా ఉన్నాయి. గార్లదిన్నె మండలంలోని పాపినేపాళ్యం, క్రిష్టాపురం,తలగాచిపల్లిలో 1నుంచి 4 తరగతు లకు ఒకే ఉపాధ్యాయుడు బోధిస్తున్నారు. అలాగే తిమ్మంపేట, పెనకచెర్ల, పెనక చెర్ల డ్యాం, కనంపల్లి సంజీవపురం, కోటంకలో ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండడంతో ఎంటీఎస్ ఉపాధ్యాయులచే బోధన సాగిస్తున్నారు.

వివరాలు ఇలా..

నియోజవర్గం	పాఠశాలలు	విద్యార్థులు
తాడిపత్రి	223	37,785
గుంతకల్లు	203	49,083
శింగనమల	281	24,298

నాణ్యత పాటించాలి



మధ్యాహ్న భోజన పథక ఏజెన్సీలు నాణ్యమైన భోజనం వడ్డిస్తే విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటారు. మెనూ ప్రకారం వంటలు వండుతున్నారా లేదా అని విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు ఆకస్మికంగా తనిఖీలు చేయాలి. నీళ్ల పప్పు, ఉడికీ ఉడకని అన్నం, నీళ్ల చారు పెడితే విద్యార్థుల్లో రక్తహీనత వంటి సమస్యలు తలెత్తి ఆసుపత్రి పాలవుతారు. పోషకాలతో కూడిన ఆహారాన్ని పెట్టేలా చర్యలు తీసుకోవాలి.

– ఈశ్వరరెడ్డి, విద్యార్థి తండ్రి, గొడ్డుమర్రి, యల్లనూరు మండలం

సకాలంలో అందని కిట్లు



ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఈ ఏడాది పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్కులు, బూట్లు, బెల్టులు ప్రభుత్వం సకాలంలో అందించలేదు. గతంలో పాఠశాల ప్రారంభం రోజునే విద్యాకానుక కిట్లు విద్యార్థులకు అందించేవారు. మూడు రోజుల క్రితం కొంతమందికి యూనిఫాం దుస్తులు అందజేశారు. సాధారణంగా బడి ప్రారంభం రోజునే రెండు జతల దుస్తులు పంపిణీ చేయాల్సి ఉంది.

– రామాంజనేయులు, బూదేడు, గార్లదిన్నె మండలం

ఆర్డీటీ స్కూల్‌లో తరగతులు



మా గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను గ్రామ ఆర్డీటీ స్కూల్‌లో నిర్వహిస్తున్నారు. 1–5 తరగతులకు సంబంధించి 60 మంది దాకా పిల్లలు ఉన్నారు. అన్ని తరగతులను ఆ భవనంలోని ఒకే గదిలో నిర్వహిస్తున్నారు. దీంతో ఉపాధ్యాయులు బోధించే పాఠ్యంశాలు విద్యార్థులకు అర్థం కావడం లేదు. దీంతో పిల్లల విద్యాభ్యాసానికి శరాఘాతంగా మారింది.

–ఎం.రాజశేఖర్, దిబ్బసానిపల్లి, పామిడి మండలం

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు నాసిరకం, నాణ్యతలేని భోజనాన్ని వండి వడ్డిస్తున్నారు. చాలాచోట్ల కుళ్లిన కూరగాయలు వంటకు వాడుతున్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం నాణ్యమైన ఆహారాన్ని అందించేలా చర్యలు తీసుకోవాలి. లేకుంటే ఉద్యమ బాట పడతాం.

– వెంకట్‌నాయక్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి, గుంతకల్లు

యూనిఫాం పంపిణీలో ప్రభుత్వం విఫలం



ప్రభుత్వ, మున్సిపల్, ఎయిడెడ్, కేజీబీవీ పాఠశాలల్లోని విద్యార్థులకు యూనిఫాం పంపిణీలో ప్రభుత్వం విఫలమైంది. పాఠశాలలు తెరిచి రెండు నెలలైనా ఇప్పటికీ యూనిఫాం ఇవ్వకపోతే ఎలా? ప్రభుత్వంస్పందించి. మెగా డీఎస్సీ ద్వారా టీచర్ పోస్టులు భభర్తీ చేసి ఉపాధ్యాయుల కొరత తీర్చాలి. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి. – సి.రమేష్, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు, గుంతకల్లు

ఉపాధ్యాయులు లేకుంటే చదువెలా?



బడులు తెరిచి రెండు నెలలు కావస్తున్నా 6,7,8 తరగతులకు ఇద్దరు టీచర్లు లేకుంటే చదువెట్లా వస్తాది. చదువు చెప్పేవారు లేనందున ఆయా తరగతుల్లో సిలబస్ అర్థం కాక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యాశాఖ అధికారులు స్పందించి తక్షణమే ఖాళీగా ఉన్న రెండు టీచర్ పోస్టులను భర్తీ చేయాలి.

– జిలాన్, విద్యార్థి తండ్రి, రాయలచెరువు, యాడికి మండలం

హిందీ ఉపాధ్యాయుడు లేక ఇబ్బంది



ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడు లేక పోవడంతో సిలబస్ ముందుకు సాగడం లేదు. చదువులోనూ చాలా ఇబ్బందులు పడుతున్నాం. సోషల్ సార్ కూడా రిటైర్డ్ అయ్యారు. కానీ ఆయన రోజూ వచ్చి పాఠాలు చెబుతున్నారు. అధికారులు స్పందించి పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత పరిష్కరించాలి.

–సాయి పార్వతి, 9వ తరగతి, తాడిపత్రి

'సుప్రీంకోర్టు సాక్షిగా భారత రాజ్యాంగం ఖూనీ'

పామిడి: సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ఇచ్చిన తీర్పు భారత రాజ్యాంగాన్ని ఖూనీ చేయడమేనని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు కే వెంకట చలపతి అన్నారు. ఆదివారం మాలమహానాడు ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. ముందుగా భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కేవీ చలపతి మాట్లాడారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 14, 341 పరిగణలోనికి తీసుకోకుండా సుప్రీంకోర్టు ఏడుగురు జడ్జీలతో కూడిన ధర్మాసనం ఎస్సీ వర్గీకరణకు సానుకూల తీర్పు ఇవ్వడం దుర్మార్గమన్నారు. ఈ తీర్పుపై మాలమహానాడు జాతీయ నాయకులు తొమ్మిది మంది జడ్జీలతో కూడిన ధర్మాసనం ముందు అప్పీలు వేయబోతున్నారన్నారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకిస్తూ ఢిల్లీలో చేపట్టబోయే మాలల ఉద్యమానికి ఊతమివ్వాలన్నారు. కార్యక్రమంలో ఆసంఘం మండల నాయకులు, కద్దీల రాజు, ఓబులేసు, అంజి, రవి, రామాంజనేయులు, రమేష్, ప్రచండరాజు, శివ, జితేందర్, భార్గవ, సుధాకర్, రాము, వెంకటేష్, పృథ్వీ, ఆనంద్, వంశీ, యోగేశ్వర్ రామాంజనేయులు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న మాల మహానాడు నేతలు

వైద్య శిబిరానికి స్పందన

యాడికి: మండల కేంద్రంలోని కోన రోడ్డులో ఉన్న వివేకానంద హైస్కూల్‌లో ఆదివారం విశాలాక్షి ఖాదీ గ్రామీణ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. కిమ్స్ సవీరా వైద్యులు చేపట్టిన శిబిరంలో దాదాపు 130 మందికి ఈసీజీ, టూడీ ఎకో తదితర పరీక్షలు చేశారు. ఇందులో ఏడుగురికి శస్త్రచికిత్స అవసరమని గుర్తించినట్లు విశాలాక్షి ఖాదీ సంస్థ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో విశాలాక్షి ఖాదీ సంస్థ సభ్యులు నారాయణస్వామి, ఆదిరెడ్డి, రామాంజనేయులు, తిరపురం జగదీస్, మురళి, లక్ష్మీనారాయణ, కిమ్స్ సవీరా వైద్య బృందం పాల్గొన్నారు.

ఐటీఐ మూడో విడత అడ్మిషన్లు ప్రారంభం

గుంతకల్లుటౌన్: ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో చేరడానికి మూడో విడత అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ విద్యాసాగర్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు ఐటీఐ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఈ నెల 26గా దరఖాస్తు చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దరఖాస్తు చేసుకున్న వెంటనే స్థానిక ఐటీఐలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు.

నేడు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

గార్లదిన్నె: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కార్యక్రమానికి మండలస్థాయి ప్రభుత్వ వివిధ శాఖల అధికారులు తప్పక హాజరు కావాలన్నారు. అలాగే ప్రజలు నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించి పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు.

యల్లనూరు: మండలంలో ఏవైనా సమస్యలు ఉంటే అర్జీలు ఇవ్వాలని ఇన్‌చార్జ్ తహసీల్దారు శ్వేత సూచించారు. సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో సమస్యలపై అర్జీలు ఇస్తే ఆయా శాఖల అధికారులతో చర్చించి సమస్యను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరు కావాలన్నారు.

రెండు బైక్‌ల ఢీ .. ఇద్దరికి గాయాలు

గుత్తి: పట్టణ శివారులోని మోడల్ స్కూల్ సమీపంలో ఆదివారం రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరు వ్యక్తులు గాయపడ్డాడు. ప్యాపిలికి చెందిన శ్రీనివాసులు, మధు బైక్‌లో గుత్తికి వచ్చారు. పని ముగించుకుని తిరిగి బైక్‌లో ప్యాపిలికి బయలు దేరారు. మోడల్ స్కూల్ సమీపంలో మరో బైక్ వెనుక నుంచి ఢీకొంది. ఘటనలో శ్రీనివాసులు, మధు గాయపడ్డారు. స్థానికులు వారిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఘనంగా ఆరాధనోత్సవం

పామిడి: పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో ఆదివారం ఆరాధనోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్ క్రైస్తవులను ఉద్దేశించి ప్రసంగించారు. దేవుడి మాట చొప్పున నడుచుకుంటే మన జీవితాలు ధన్యకరమవుతాయన్నారు. ఏసుక్రీస్తు అందరికీ ప్రభువన్నారు.



వైభవంగా చౌడేశ్వరీ దేవి జయంతి



తాడిపత్రిలోని యల్లనూరు రోడ్డు వద్ద ఆలయంలో చౌడేశ్వరీదేవి



శింగనమలలో అలంకరణలో చౌడేశ్వరి అమ్మవారు



తాడిపత్రి మండలంలోని చిన్న పొలమడలో డ్రై ఫ్రూట్స్ అలంకరణలో అమ్మవారు



పెద్దపప్పూరులో రామకోటికాలనీలోని చౌడేశ్వరీదేవి



పెద్దవడుగూరు మండలం క్రిష్టిపాడులో అలంకరణలో చౌడేశ్వరీదేవి

తాడిపత్రి అర్బన్/రూరల్/యాడికి/శింగనమల/పెద్దపప్పూరు/పెద్దవడుగూరు: తాడిపత్రి, గుంతకల్లు, శింగనమల నియోజకవర్గాల్లోని చౌడేశ్వరీదేవి ఆలయాల్లో అమ్మవారి జయంతి ఉత్సవాలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. మహిళలు కలశ బిందెలతో ప్రత్యేక పూజలు చేసి, కుంకుమార్చన చేశారు. అనంతరం భక్తులను అమ్మవారి దర్శనానికి అనుమతించారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.



యాడికిలోని చౌడేశ్వరీ దేవి ఆలయంలో పూజలు చేస్తున్న దృశ్యం



పెద్దవడుగూరు మండలం క్రిష్టిపాడు చౌడేశ్వరీదేవికి బోనాలు తీసుకెళ్తున్న భక్తులు

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
తాడిపత్రి డివిజన్
9912220732, 9912220722, 9010588846, 9010223701